## సమ్మెతో స్తంభించిన ప్రజా రవాణా వ్యవస్థ




# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 23 ఏప్రిల్, 2026 | పేజీలు :08


# ఆగని లాడ్జ్‌ల దందా

### పర్యాటకులు ఎంత ఎక్కువ ఉంటే అన్ని పైసలు

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:**పర్యాటకులు తాకిడి ఎంత ఎక్కువగా ఉంటే సంబంధిత పరిసరాలలో పర్యాటకుల అవసరాల నిమిత్తం చుట్టు పక్క పర్యాటక కేంద్రాలలో హోటల్లు, లాడ్జ్‌లు వెలుస్తుంటాయి. గోవిందరావుపేట మండల కేంద్రంగా ఎటుచూసినా రాకపోకలు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండటం వలన మండలంలో అనేక లాడ్జ్‌లు వెలిసినాయి 163 వ జాతీయ రహదారి వెంట లక్నవరం సరస్సు మేడారం సమ్మక్క సారక్క జాతర భాగోత జలపాతం మల్లూరు లక్ష్మి నరసింహా స్వామి గుడి పర్యాటక కేంద్రాలు ఇలా ఎన్నో ఉన్నాయి. పర్యాటక కేంద్రాలకు నిత్యం భక్తులు పర్యాటకులు రాకపోకలు చేస్తున్న సమయంలో దూర ప్రాంతం వెళ్లే వారు మాత్రం గోవిందరావుపేట మండల కేంద్రంగా ఉన్న లాడ్జ్‌లలో బస చేస్తుంటారు. లాడ్జ్‌లకు ఇప్పటివరకు ఎలాంటి ప్రభుత్వ ఆధారిత అనుమతులు ఇవ్వాలి అంటే ఫైర్ సేఫ్టీ హోటల్స్‌కు అనుమతులు కావాలంటే ఫుడ్ అండ్ సేఫ్టీ పొల్యూషన్ సంబంధిత పత్రాలు గ్రామపంచాయతీ అధికారులకు సమర్పిస్తేనే గాని లాడ్జ్‌లకు హోటల్స్‌కి గాను అనుమతులు ఇస్తారు మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండానే పుట్ట గొడుగుల్లాగా లాడ్జ్‌లు నిర్మిస్తున్నారు అంటే అధికారుల దగ్గర అలసత్వం ఎంత ఉన్నదో అర్థమవుతూనే ఉంది గతంలో దినపత్రికలలో లాడ్జ్‌లపై ఎన్నో కథనాలు ప్రచురించగా ప్రచురించిన కథనాలకు అధికారులు స్పందించి ఒకసారి నామ మాత్రపు నోటీసులు ప్పించి చేతులు దులుపుకొని నేటి వరకు కూడా ఎలాంటి నోటీసులు గాని చర్యలు తీసుకోవడం పై విడ్డూరానికి గురి చేస్తున్నది మండలంలో లాడ్జ్‌లను యజమానులు వారి అవసరాల నిమిత్తం ఒక గంట నుండి ఒక పూట వరకు ఒక రోజు వరకు ఇచ్చుకుంటూ వచ్చిన




పర్యాటకుల దగ్గర అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉండే గోవిందరావుపేట మండలం లాడ్జ్ లలో ఎలాంటి అ సాంఘిక కార్యక్రమాలైన జరిగి సమస్యలకు తావు తీయకముందే అధికారులు స్పందించి పుట్ట గొడుగుల్లాగా పుట్టు కొస్తున్న లాడ్జ్‌ల పై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు

**అనుమతి పత్రాలు సమర్పించకపోతే లాడ్జ్‌లను సీజ్ చేస్తాం**
**ఇన్‌చార్జి ఎంపిడిఒ మమత**

గతంలో దినపత్రికలో వచ్చిన కథనాలకు స్పందించి మొదటి విడతగా మండలములో ఉన్న లాడ్జ్‌లకు హోటళ్లకు నోటీసులు పంపించగా ఎవరు ఇప్పటి వరకు స్పండించి ఎలాంటి అనుమతి పత్రాలు ఎంపిడిఒ కార్యాలయానికి సమర్పించలేదని త్వరలోనే రెండవ దఫ నోటీసులు పంపించినా కూడా స్పందించకపోతే మూడవ దఫనోటీసులు ఇచ్చిన వెంటనే మండలంలో ఉన్న ఎలాంటి అనుమతులు లేని లాడ్జ్‌లను సీజ్ చేస్తామని అన్నారు.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

### ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి** :రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వ కొనుగో లు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని భూ పాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రా వు అన్నారు. భూపాలపల్లి మండలం అటవీ గ్రామాలైన కమలాపూర్, నాగారం, ఆజంనగ ర్, నంది గామ, దీక్షకుంట, పంబాపూర్, గొల్లబుద్ధారం, గొల్లబుద్ధారం తండా గ్రామాలలో పి.ఏ.సి.ఎస్, మాక్స్,ఐ.కె.పి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు పండించిన సన్న ధాన్యానికి మద్దతు ధర 2389 రూపాయలతో పాటుగా బోనస్ 500 రూపాయలు చెల్లిస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు కోత మిషన్ల యొక్క ఆర్.పి.ఎం 18 నుండి 20 వరకు, బ్లోయర్ ఆన్‌లో ఉంచే విధంగా కోత మిషన్ యజమానులకు తెలియచేయాలని ఇలా చేయడం వలన ధాన్యంలో తాలు ఉండదని తెలిపారు. రైతు పండించిన వరి ధాన్యాన్ని దళారు చేతులు మోసపోకుండాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని రైతులకు సమయానికి డబ్బులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే కొనుగోలు కేంద్రాలలో తేమ ప్రమాణాలు, కొలతలు సక్రమంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్, డిఎం సివిల్ సప్లై అధికారి రాములు, ఎమ్మార్వో, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, రైతులు పాల్గొన్నారు.

# ధరిత్రి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి




### హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రజాపక్షం/హనుమకొండ :** భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు.బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా రూపొందించిన “ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ (ఏప్రిల్ 15–30)” పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెరుగుతున్న వాతావరణ, భూ కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పనిలో పర్యావరణ స్పృహ కలిగి ఉండాలని సూచించారు. పక్షం రోజుల పాటు నిర్వహిస్తున్న మదర్ ఎర్త్ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలు మొక్కల నాటకం చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే ఏక వినియోగ ప్లాస్టిక్‌ను నివారించడం, గుడ్డ సంచుల వినియోగాన్ని ప్రోత్సహించడం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం, పర్యావరణహిత కార్యక్రమాలపై అవగాహన పెంపొందించడం వంటి చర్యలు తీసుకోవాలని తెలిపారు.పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్ ర్యాలీలు, ఉదయ నడకలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. వెంకట గిరిరాజ్ గౌడ్, డిపిఆర్ఓ ఆయూబ్ అలీ, కుడా ప్లానింగ్ అధికారి అజిత్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మరియు ఎన్‌జీసీ కన్వీనర్ ఎస్. శ్రీనివాస స్వామి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# టీ స్టాల్, మిల్క్‌డెయిరీ తొలగింపుపై ఆందోళన

### హైకోర్టు ఉత్తర్వులను కలెక్టర్ ధిక్కరించారని ధర్నా



**ప్రజాపక్షం/జనగామ:**జనగామ కలెక్టర్ ముందు ఏర్పాటు మహిళాశక్తి పథకంలో ప్రారంభించిన టీ స్టాల్, మిల్క్‌డైరీ తొలగింపు, డబ్బాల తరలింపుపై రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హైకోర్టు నిబంధనల్ని సైతం లెక్కచేయకుండా నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం అర్ధరాత్రి టీస్టాల్, మిల్క్‌డైరీ డబ్బాలు తొలగించడంతో నిర్వాహకులు బుధవారం ఉదయం చూసి ఆందోళనకు గురయ్యారు. నిర్వాహకులతో పాటు సిపిఎం, బిఆర్‌ఎస్, ఎంఆర్‌పిఎస్ నాయకులు మధ్యాహం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వయించారు. రెండు గంటలకు పైగా ధర్నా చేయడంతో కలెక్టరేట్‌లోకి వెళ్లెవారు వెళ్లలేక ఇబ్బలు పడ్డారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, న్యాయవాది సాదిక్ అలీ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు గద్దల కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం కోటీ మంది మహిళల్ని కోటీశ్వరులను చేస్తామని టీ స్టాల్, మిల్క్ డైరీ వంటివి ఏర్పాటు చేయగా గత కలెక్టర్ ప్రారంభించి ప్రస్తుత కలెక్టర్ తొలగించడం అన్యాయమన్నారు. టీస్టాల్, మిల్క్ డైరి నిర్వాహన కోసం డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో మూడు లక్షల చొప్పున రుణం కూడా ఇవ్వడం జరిగిందని ఇప్పుడు ఆ రుణం ఎలా చెల్లించాలని ప్రశ్నించారు. డబ్బాలను తొలగించొద్దని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని, అయినా అధికారులు అర్ధరాత్రి చెప్పకుండా తొలగించడం సరియైంది కాదన్నారు. మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్‌రెడ్డి నిర్వాహకులకు నోటీసులు ఇవ్వకుండా కనీసం వారిని పిలవకుండా పోలీస్ క్వార్టర్ గోడ పక్కన ఎలా పడవేస్తారని మండిపడ్డారు. ఉపాధి చూపించడం అంటే రుణం ఇచ్చి వేసుకున్న డబ్బాలు తొలగించడమా అని మండిపడ్డారు. నిర్వాహకులను ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలని కోర్టు ఉత్తర్వుల్లో ఉందని, అధికారులు ఉత్తర్వులను దిక్కరించి డబ్బాలు తొలగించారని మండిపడ్డారు. టీ స్టాల్, మిల్క్ పార్లర్ కోసం తీసుకున్న రుణాన్ని రద్దు చేయాలని, సమాచారం ఇవ్వకుండా తొలగించిన కమీషనర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బూడిద జ్యోతి, పానుగంటి సువార్త, ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు మంగళంపల్లి రాజు, మల్లిగారి రాజు, ఇరుగు సిద్దులు, వాంకుడోతు అనిత, రాగళ్ల ఉపేందర్, ఊడుగుల సాగర్, సిఐటియు జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్, తూటి దేవదానం, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు బూడిద గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, మౌనిక, బొట్ల శ్రవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తెలంగాణ రెండో పీఆర్సీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం పీఆర్సీ గడువు పొడగించకుండా, వెంటనే నివేదిక తెప్పించుకుని సంఘాలతో చర్చించి అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆద్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్మాణం చేస్తున్న సంఘం భవన్ శంకుస్థాపన కార్యక్రమం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు అద్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు పోరుబాట పట్టారని, ప్రభుత్వం విజ్ఞతతో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఆకుల శ్రీనివాసరావు, జయప్రకాశ్, శ్రీనివాస్, రవీందర్, రాజు, కుమార్, పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన కౌన్సిలర్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, రిటైర్డ్ ఎంఈవో మేకల రవి కుమార్ తల్లి యాదమ్మ అనారోగ్యంతో మృతిచెందడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె భౌతిక కాయాన్ని వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యులు బూడిద గోపి, సీపీఎం సీనియర్ నాయకులు దస్తగిర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ప్రభాకర్, సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ నబీ సాబ్ స్మారక అవార్డుకు ఎంపికైన మంగళంపల్లి రాజు



**ప్రజాపక్షం/జనగామటౌన్:** జిల్లాలోని ప్రముఖ కవులు, కళాకారులు కలిసి ఏర్పాటుచేసిన కవులు కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇచ్చే ప్రతిష్టాత్మక అబ్దుల్ నబీ సాబ్ స్మారక వార్డును ఈ ఏడాది యువ నాయకుడు, సామాజిక కార్యకర్త మంగళంపల్లి రాజుకు ప్రకటించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హైకోర్టు న్యాయవాది మహ్మద్ సాధిక్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. కళాకారుల ఐక్యవేధిక కార్యాలయంలో కల్నల్ డా. బిక్షపతి చేతుల మీదుగా రాజుకు అవార్డు అందించడం జరిగింది. వారి వెంట కవులు, కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షులు, ప్రజాగాయకుడు జి కృష్ణ, సోమేశ్వరచారి, నరసింహచారి, సదానందం, సాయి, మనోజ్‌కుమార్, లక్ష్మణ్, తదితరులున్నారు.

## ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన విప్లవకారుడు లెనిన్

### దోపిడీ నివారణకు ప్రత్యామ్నాయం మార్క్సిజమే: పెద్దారపు రమేష్

**ప్రజాపక్షం/ వరంగల్:** ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన మహా విప్లవకారుడు వ్లాదిమీర్ లెనిన్ అని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. దోపిడి, అసమానతలకు ప్రత్యామ్నాయం మార్క్సిజమేనని, కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. లెనిన్ 156వ జయంతి సందర్భంగా వరంగల్ ఓంకార్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నగర కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమేష్ మాట్లాడుతూ బోల్షివిక్ పార్టీ స్థాపనతో 1917లో రష్యాలో సామ్యవాద వ్యవస్థను అమలు చేసి శ్రామిక వర్గానికి దిశానిర్దేశం చేసిన నాయకుడు లెనిన్ అని అన్నారు. అతని స్ఫూర్తితోనే చైనా, క్యూబా, వియత్నాం వంటి దేశాల్లో వామపక్ష ఉద్యమాలు బలపడినట్లు తెలిపారు. సమానత్వ సమాజ నిర్మాణం కోసం కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని, దోపిడి పాలనలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు హర్షణీయం

**ప్రజాపక్షం/ వరంగల్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థలకు కావలసిన చేనేత ఉత్పత్తులను టెస్కో ద్వారానే సేకరించాలని రాష్ట్ర హైకోర్టు తీర్పునివ్వడం పట్ల తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల విద్యార్థులకు దుస్తుల సరఫరా కోసం జారీ చేసిన ఈ టెండర్ నోటిఫికేషన్ వలన చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి వస్తుందని దీనిని రద్దు చేయాలని ప్రభుత్వ శాఖలకు కావలసిన అన్ని రకాల చేనేత ఉత్పత్తులు తెలంగాణ రాష్ట్ర హైండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ (టెస్కో) ద్వారానే కొనుగోలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా చేనేతన్నలు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో వరంగల్ వీరాంజనేయ హ్యాండ్లూమ్ వీవర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ ప్రొడక్షన్ అండ్ సేల్స్ సొసైటీ ప్రభుత్వము 2024లో విడుదల చేసిన జీవో కు విరుద్ధంగా టెండర్లు పిలవడంపై వేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ టెండర్ చట్ట విరుద్ధమని తీర్పునివ్వడం స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వ సంస్థలకు కావలసిన కార్పెట్స్ , బెడ్ షీట్స్ , టవల్స్, దుస్తులు టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలని హైకోర్టు ఆదేశించడం నేతన్నలకు ఊరట కలిగిస్తున్నదన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఇప్పటికైనా చేనేత వ్యతిరేక విధానాలను విడనాడాలని చేనేత కార్మికుల ప్రయోజనాలు కాపాడడానికి పరిశ్రమ పరిరక్షణకు చేయూతను అందించాలన్నారు. చేనేత సహకార సంఘాల రుణాలన్నింటిని మాఫీచేసి తిరిగి రుణ సౌకర్యం కలిగించాలని కార్మికులకు చేతినిండ పని కలిగించడం, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్ల అమలుతోపాటు వారి సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టాలని, ఎన్నికల ముందు నేతన్నలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

### మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

**ప్రజాపక్షం/ తొర్రూరు :** ప్రతీ ఒక్కరూ వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ అన్నారు. మండలంలోని మడిపెల్లి గ్రామంలో బుధవారం అరీవ్ అలీవ్ మన ఊరు మన బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సుమారు 200మంది గ్రామస్తులతో కలిసి జిల్లా ఎస్పీ శబరీష్ హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం రోడ్డు భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. గ్రామ భద్రతను పెంపొందించడంలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో కీలకమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సర్పంచ్ రామలింగం, దాతలను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను కాపాడే ముఖ్యమైన రక్షణ కవచమని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించడంలో హెల్మెట్ వినియోగం ఎంతో అవసరమన్నారు.



గ్రామాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం సమాజాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి వినియోగం, రవాణా చేస్తున్నట్లు సమాచారం అందించిన వారికి రూ.ఐదువేల నగదు బహుమతి అందజేస్తామని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యతను పూర్తిగా కాపాడుతామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పోలీసు శాఖ సూచనలను పాటిస్తూ మడిపెల్లి గ్రామాన్ని సురక్షిత, ఆరోగ్యకర్త, మత్తు మందుల రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమన్నారు. గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ డాక్టర్ శబరిష్ అభినందించారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/తొర్రూరు :** అంతర్జాతీయ మేడే కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఓమ బిక్షపతి, ఏఐటీయూసీ మండల నాయకులు బంధు మహేందర్ అన్నారు. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనం ఆవరణలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిక్షపతి, మహేందర్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం నిర్వహిస్తామన్నారు. పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. కాంట్రాక్టర్లు కార్మికుల పైన పెత్తనం చేస్తూ ఆర్థిక దోపిడికి పాల్పడుతున్నారని అన్నారు. అంతర్జాతీయ కార్మిక మేడే దినోత్సవ వేడుకలను తొర్రూరు పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు తొలగించి రాంజీపేరు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మణ్, సూరబోయిన వీరన్న, బొల్లు శ్రీను, దాసరి కృష్ణమూర్తి, మంగళపల్లి యాకయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్...వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** సీతారాంపురం స్టేజీ సమీపంలో అర్థరాత్రి ఆగి ఉన్న లారీ కిందకి పల్సర్ బైక్‌తో వెళ్తున్న వ్యక్తి వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దేవరుప్పుల ఎస్ఐ సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ముత్యం మహేష్ అనే వ్యక్తి యాదాద్రి జిల్లా బ్రహ్మణపల్లికి చెందిన కానిస్టేబుల్ అని తెలిపారు. తన సొంత ఊరు బ్రహ్మణపల్లికి తన బైక్‌పై వెళ్తుండగా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతుని సోదరుడు గోపాల్ పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సృజన్‌కుమార్ తెలిపారు.

## ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలి

**ప్రజాపక్షం/తొర్రూరు :** ఆర్‌టిసిసంస్థను ప్రభుత్వంలో వెంటనే విలీనం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలోని ఆర్‌టిసి డిపోలో జెఎసిఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన సమ్మెకు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నుంచి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలకుంట్ల సాయిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన తీర్మాణం ప్రకారం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. డిపోలో యూనియన్లను పునరుద్దరించాలని, 2021 నుంచి 2025 వేతన సవరణలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలన్నారు. ఆర్టీసీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు చేస్తే ఉద్యమాలు తీవ్రతరం అవుతుందన్నారు. సంస్థలో యూనియన్‌లను పునరుద్దరించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచాలని, కార్మికులకు ఆర్థికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో కార్మికులుపాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని లయన్స్‌క్లబ్ ఎలెక్టెడ్ ఫస్ట్ గవర్నర్ పుట్ట హరికృష్ణ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో తిమ్మాపురం స్కూల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రపంచ భూ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్కూల్ విద్యార్థులకు ఇంకుడు గుంత ఏర్పాటుచేసుకునేలా గ్రామ ప్రజలకు లయన్స్‌క్లబ్ ద్వారా ఇంకుడు గుంతలు ఏ విధంగా నిర్మించుకోవాలో కరపత్రాలు పిల్లలకు ఇస్తూ అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ చెట్లు నాటే కార్యక్రమంలో భాగంగా మొక్కలు వితరణ చేయడం జరిగింది. స్కూల్ విద్యార్థులకు తిమ్మాపురం గ్రామ వార్డు మెంబర్ నోట్‌బుక్స్‌ను కోడిమాల సురేష్ సహాయంతో అందించడం జరిగింది. అదేవిధంగా స్థానిక అలియాబాద్ శివారులో ప్రభుత్వం నడిపిస్తున్న ఐకేపీ సెంటర్ వద్ద లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శి, సభ్యుల సహాయంతో చలివేంద్రం ఏర్పాటుచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జఫర్‌గడ్ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మామిడాల పూర్ణచందర్ , తిమ్మాపురం సర్పంచ్ పులి సమ్మయ్య, హిమ్మత్ నగర్ హైస్కూల్ హెచ్‌ఎం మంగు జయప్రకాశ్, హెచ్‌ఎం రమణ, ఉపాధ్యాయులు జ్యోతి, క్లబ్ ప్రతినిధులు నరేష్, శ్రీధర్‌జ పీఆర్‌వో బోనగిరి శ్రవణ్‌కుమార్, గ్రామస్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## కొడవటూర్ పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం ఎంతో కీలకమని, విద్యార్థుల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ వస్తువులను వితరణ చేయడం అభినందనీయమని బచ్చన్నపేట ఎంఈవో వెంకటరెడ్డి, కొడవటూర్ సర్పంచ్ నీల కవిత మురళి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొడవటూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో దాత బత్తుల ఉపేందర్ సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణి చేశారు. పాఠశాల హెచ్‌ఎం నరసింహ స్వామి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం పాఠశాలలోని విద్యార్థులందరికీ వాటర్ బాటిల్స్ పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, కిషన్, అంకుషావలి, రఘుమూర్తి, సిద్దులు, శ్యామల, రాధిక, తార, తదితరులు పాల్గొన్నారు.

## లెనిన్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/పాలకుర్తి:** సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ నిర్మాత, మార్క్సిస్టు మహోపాధ్యాయులలో ఒకరైన కామ్రేడ్ లెనిన్ 157వ జయంతి వేడుకలను నల్ల నరసింహులు విగ్రహం వద్ద లెనిన్ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ సృష్టికర్త కామ్రేడ్ చారు మజుందార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అనంతోజు రజిత, కళింగరాజు, శ్రీనివాస్, రాజు, కార్తీక్, సారయ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# కుట్రల కమిషన్‌పై హైకోర్టు తీర్పు చెంపపెట్టు

## మాజీ చీఫ్ విప్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** కాంగ్రెస్ కుట్రల కమిషన్ పై హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటి దని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బిఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వేసిన కమిషన్ పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో దాస్యం వినయ్ భాస్కర్ పార్టీ శ్రేణులతో కలిసి హనుమకొండ చౌరస్తా వద్ద బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు నిర్వహించారు
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణను కోటి ఎకరాల మాగానిగా చేసేందుకు కేసీఆర్ ప్రపంచంలోనే గొప్పదైన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడం జరిగిందని అన్నారు. కుట్రపూరితంగా కేసీఆర్ ను బదనాం చేసేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు పై కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ వేసిందన్న విషయాన్ని గుర్తు చేశారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కక్షపూరిత ధోరణికి చెంపపెట్టు అని అన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను వేధించేందుకు, రాజకీయంగా అభాసు పాలు చేయాలనుకుంటున్న కాంగ్రెస్ కుట్రలు హైకోర్టు తీర్పుతో పటాపంచలు అయ్యాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పై వేసిన కమిషన్ అంతా ట్రాష్ అని హైకోర్టు తీర్పుతో తేలిపోవడం సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

**రాజకీయ అవసరాలకే కాళేశ్వరంపై అసత్య ప్రచారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన స్టే బీఆర్ఎస్ పార్టీ నిజాయితీకి నిదర్శనం అని, రాజకీయ కక్షసాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ రైతులను ఆగం చేసింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఇప్పటికైనా రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేస్తు సాగునీటిని విడుదల చేయాలని సూచించారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదని, ముమ్మాటికి పీసీసీ నివేదికని, బీఆర్ఎస్ పార్టీ ముందు నుంచి చెబుతున్న మాట ఇవ్వాళ అక్షరాలా నిజమని తేలిపోయిందన్నారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువు అయిందన్నారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు.

# ట్రాఫిక్ సిబ్బందికి చలువ అద్దాల పంపిణీ

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వేసవికాలంలో పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని హనుమకొండ శరత్ కంటి హాస్పిటల్ వారి సౌజన్యంతో హన్మకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు చేతుల మీదుగా ట్రాఫిక్ సిబ్బందికి చలువ అద్దాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు మాట్లాడుతూ ట్రాఫిక్ సిబ్బంది విధి నిర్వహణలో ఆరోగ్య పరిరక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీతా రెడ్డి, శరత్ కంటి హాస్పిటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో మహిళ మృతి

**ప్రజాపక్షం/గూడూరు;**గూడూరు మండలం బొద్దుగొండ శివారు మల్లన్న గూడెం గ్రామానికి చెందిన పుల్సం ఎల్లమ్మ (48) వడదెబ్బకు గురై మృతి చెందిన విషాద సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది వివరాల్లోకి వెళ్తే తీవ్ర ఎండలం కారణంగా అస్వస్థతకు గురైన ఎల్లమ్మకు వాంతులు కావడంతో ఆమే కుమారుడు పేల్సం సురేష్ కుమార్తె శ్రీలత కలిసి వెంటనే గూడూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లన్న సమయంలో మార్గమధ్యలో ఎల్లమ్మకు తల నిరంతరం కళ్లుతిరుగుతున్నట్లు లక్షణాలు కనిపించడంతో వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకోని తరలించారు. అయితే ఆసుపత్రిలో చేర్చిన కొద్దిసేపటికే వైద్యులు ఎల్లమ్మ మరణి ంచినట్లు ధృవీకరించారు.

# బిఆర్ఎస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/కాళేశ్వరం:**మహదేవపూర్ మండలం పల్లుల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ మహిళ ఉపాధ్యక్షురాలు మేకల పద్మ మరియు మహిళా నాయకురాల్లు లావణ్య, స్వప్న, దుర్గక్క, నాయకులు పానెం రాకేష్, పసుల సమ్మరాజు, పానెం రాజయ్యలు మంథని పట్టణంలోని రాజగృహలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వారికి బిఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు.

# పోషణపక్వాడ కార్యక్రమం

**ప్రజాపక్షం/కాళేశ్వరం:**మహదేవపూర్ మండలం పల్లుల గ్రామంలోని అంగన్ వాడి2 కేంద్రం లో బుధవారం ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్పందన ఆధ్వర్యంలో పోషణపక్వాడ్ మరియు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ స్పందన మాట్లాడుతూ, ప్రతి గర్భిణి స్త్రీలు, బాలింతలు, పిల్లలు పోషకాహారాలతో కూడిన ఆహారం తీసుకోవాలని అన్నారు. రక్తహీనత రాకుండా సమతుల్య ఆహారంతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. అంగన్ వాడి కేంద్రంలో ఆటపాటలతో చిన్నారులు సందడి చేసారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొరె విజయ లక్ష్మి, ఉప సర్పంచ్ ఒద్ది చంద్రయ్య, అంగన్ వాడి టీచర్ ఉమామహేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేష్, విఓ అధ్యక్షులు సుగుణ, పలువురు వార్డు సభ్యులు, గర్భిణీలు, బాలింతలు,తల్లులు,పిల్లలు,స్థానికులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతుల ఆందోళన

**ప్రజాపక్షం/గూడూరు;** మొక్కజొన్న పంటకు సరైన ధర లభించకపోవడంతో గూడూరు మండలంలోని రైతులు ఆందోళన బాట పట్టారు. పంట కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యం కనీస మద్దతు ధర అమలు లోపం వంటి సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తూ రైతులు జాతీయ రహదారి 365 పై రాస్తారోకో నిర్వహించారు.బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పెద్ద సంఖ్యలో కూడిన రైతులు రహదారిపై కూర్చొని వాహన రాకపోకలను నిలిపివేశారు.దీంతో కొంత సపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకోని పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారు. రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు సరైన ధరలు లేకపోవడంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంటకు గిట్టుబాటు ధర ప్రకటించడంతో పాటు కొనుగోలు కేంద్రాలపను సమర్థంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.అలాగే కొనుగోలు కేంద్రాలలో తూకం సమస్యలు చెల్లింపెఉల్లో ఆలస్యం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆరోపించారు. ఈసమస్యలను వెంటనే పరిష్కరించపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా స్థానిక నాయకులు రైతు సంఘూల ప్రతినిధులు రైతులకు మద్దతగా నిలిచారు. ప్రభుత్వం రైతుల సమస్యలను గంభీరంగా తీసుకోని తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కొరారు.

# ఊరపందుల దాడిలో బాలుడికి గాయాలు

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** బుధవారం ఆత్మకూరు మండలం నీరుకుల్లా గ్రామంలో పందుల దాడిలో బాలుడు గాయపడిన సంఘటన జరిగినది.. వివరాల్లోకి వెళ్ళగా నీరుకుల గ్రామానికి చెందిన ఆరేపల్లి కాలనీ లోని బోరగాని నాగరాజు 10 సంవత్సరాల పిల్లవాడు ఇంటి వద్ద ఆడుకుంటుండగా విచ్చలవిడిగా తిరుగుతున్న ఊర పందులు బాలుడు పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అటుగా వెళుతున్న స్థానికులు గమనించి పందులను తరిమివేయగా బాలుడు తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. ఎవరు గమనించకుండా ఉంటే పరిస్థితులు వేరే విధంగా ఉండేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలుని ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. నీరుకుల్లా, పెంచికలపేట, కేశవాపూర్ గ్రామాలలో ప్రతిరోజు పందులు విచ్చలవిడిగా ఆహార వేటలో తిరుగుతూ బయట ఉన్న వస్తువులను, బర్రెల కుడితిగోళములను పగులగొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఈ సమస్యలపై ఎన్నోసార్లు జిల్లా అధికారులకు, గ్రామ పాలన అధికారులకు విన్న వించుకున్న, ఫిర్యాదులు చేసిన ఏ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వెలుబుచ్చుతున్నారు. ఇకనైనా అధికారులు పందుల యజమానులను పిలిపించి సక్రమంగా కాపాడుకోవాలని లేనిచో తగు చర్యలు మీపై తీసుకుంటామని హెచ్చరించి గ్రామస్తులకు హాని కలవకుండా కాపాడుతామని హామీలు ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# మత్తు పర్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోకూడదు..

**ప్రజాపక్షం/చేర్యాల:**యువత మత్తు పదార్థాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమళ్ అన్నారు.జిల్లా ప్రజలకు పోలీసులకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి స్నేహపూర్వక వాతవరణంలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన మన ఊరు మన పోలీస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చేర్యాల మండల పరిధిలోని ఆకునూర్ గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన సిపికి మహిళలు కోళాటాలతో,కళాకారులు డోలెడ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు.సురక్ష నేత్ర కార్యక్రమంలో భగంగా గ్రామ పంచాయితీ పరిధిలో ఏర్పాటు చేసిన 16 సిసి కెమోరాలు,పాఠశాలలో 4 సిసి కెమోరాలను ప్రారంభించారు.స్థానిక శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.ఏప్రిల్ 1న ప్రారంభమైన మన ఊరు మన పోలీస్ కార్యక్రమంవిజయవంతంగా కొనసాగుతుందని పోయిన వారం పుల్లూరు గ్రామాన్ని ఇప్పుడు ఆకునూర్ గ్రామాన్ని సందర్శించడం సంతోషంగా ఉందని అన్నారు.పోలీసులు అంటే బయటి వ్యక్తులు కాదు మన పోలీసులు అనే భావన కలగాలని గ్రామంలో ఏ చిన్న సమస్య తలెత్తిన నిస్సంకోచంగా పోలీసులను సంప్రదించాలని అన్నారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి అడ్మిన్ కుశాల్కర్,అదనపు డిసిపి సుభాస్ చంద్రబోస్,ఏసిపి సదానందం,సిఐ రమేష్,ఎస్ఐ అపూర్వరెడ్డి,పోలీస్ సిబ్బంది,ఉప సర్పంచ్ పల్లవి,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# లాండ్ డెవలప్‌మెంట్ పనులు పరిశీలించిన 'కుడా' చైర్మన్


**ప్రజాపక్షం/ఆత్మకూరు :** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో కుడా (వరంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఆధ్వర్యంలో చేపట్టిన ప్రైవేట్ ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులను బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, పీవో అజిత్ రెడ్డి, మరియు ఈఈ భీమ్ రావు గార్లు పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి చేతుల మీదుగా పనులు ప్రారంభమయ్యాయి. నిబంధనలకు అనుగుణంగా వెంచర్లను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన వసతులు అందుతాయని, ఆత్మకూరు ప్రాంతం త్వరలోనే రియల్ ఎస్టేట్ పరంగా మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కుడా సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గూడూరులో ఘనంగా లెనిన్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/గూడూరు;**లెనిల్ 156 వ జమంతి సిపిఐ ఎంఎల్ 57వ ఆవిర్బావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈసందర్భంగా సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసి పార్టీ కార్యాలయంలో లో జెండాను నాయకలు ఆవిష్కరించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐఎంఎల్ నూడెమోక్రసి గూడూరు మండల కార్యదర్శి గజ్జి లింగన్న మాట్లాడుతూ దేశంలో పేద ప్రజల సమస్యల పరిష్కారం దోపిడి నిర్మూలన సమసమాజ స్థాపన కోసం మార్క్సిజం లెనినిజం మావో సిద్ధాంతాలే సరైన మార్గమనిఅన్నారు. కుల మత వర్గ విభేదాలు ఉన్నంతం కాలం వర్గపోరాటాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.1969లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీ ప్రాంతాల్లో భూమి సమస్యల పరిష్కారానికి కృషి జరిగిందని తెలిపారు. ఈపోరాట స్ఫూర్తితోనే నేటికీ నూడెమోక్రసీ పార్టీ ప్రజాఉద్యమాలను కొనసాగిస్తున్నదని అన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ప్రభుత్వం కుల మత భావజాలిన్ని ప్రోత్సహిస్తూ ప్రజలను విభజించే విధానాలను అమలు చేస్తోందని ఏజెన్సీ ప్రాంతాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ ఆదివాసుల హక్కులను హరించిందని విమర్శించారు,దేశసంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు.రాష్ట్రంలో కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలులో విఫలం చోటుచేసుకుందని విమర్శిస్తూ పేదల హక్కుల కోసం పోరాటాలు మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో పార్టీ నాయకలు జోగ వీరస్వామి వెంకన్న కాడబోయిన నరసయ్య అడ్డూరి వెంకన్న కోటెం మజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

# అశోక జంక్షన్ వద్ద గ్రీన్ మ్యాట్ ఏర్పాటుచేసిన ట్రాఫిక్ పోలీసులు



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హనుమకొండ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం అశోకా జంక్షన్ సిగ్నల్ వద్ద వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వినూత్న చర్యలు చేపట్టారు. సిగ్నల్ వద్ద వేచి ఉండే పాద వాహనదారులకు, పాదచారులు, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులకు ఎండ తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేసినట్లుగా హన్మకొండ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ సీతారెడ్డి తెలిపారు.

## ఉపాధిహామీ కూలీలకు తాగునీరు ఫస్ట్ ఎయిడ్ బాక్సు

**ప్రజాపక్షం/మహాదేవపూర్:**మండలంలోని కుదురుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాదిహామీ పనుల్లో భాగంగా కూలీలకు బుధవారం సర్పంచ్ చల్ల సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ కలిపిన త్రాగు నీరు,ఫస్ట్ ఎయిడ్ బాక్సును అందజేసారు.ఈ సందర్భంగా చల్ల సమ్మి రెడ్డి మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్న క్రమంలో కూలీలకు శరీరంలో డీహైడ్రేషన్ ఏర్పడకుండా ఓఆర్ఎస్తో కలిపిన నీటిని అందజేసామని అలాగే గాయాలపాలైతే అప్పటికప్పుడే ప్రథమ చికిత్స అందించడానికి కావలసిన మందుల బాక్సును అందించామని అన్నారు.కూలీలు అధిక ఉష్ణోగ్రత వల్ల ఏర్పడే డీ హైడ్రేషన్తో ఆనారోగ్యం పాలు కాకుండా ఎప్పటికప్పుడు నీటిని తీసుకోవాలని సూచించారు.కూలీలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి చల్లూరి ఇందిర,ఫీల్డ్ అసిస్టెంట్ సల్ల రాజశేఖర్,ఆశా వర్కర్ దుర్గం మల్లీశ్వరి,పంచాయితీ సిబ్బందితో పాటు ఉపాది కూలీలు పాల్గొన్నారు.

## నాగారం విద్యార్థి జాతీయ స్థాయిలో మెరుపు

**ప్రజాపక్షం/నెక్కొండ :** పల్లె నుంచి పట్టుదలతో ముందుకు సాగితే జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటుకోవచ్చని నాగారం గ్రామానికి చెందిన కూరపాటి హర్షవర్ధన్ నిరూపించాడు. జేఈఈ మెయిన్స్2026 ఫలితాల్లో 99.87 పర్సంటైల్ సాధించి ఓబీసీ విభాగంలో దేశవ్యాప్తంగా 397వ ర్యాంక్ సాధించడం ద్వారా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. క్రమశిక్షణ, నిరంతర శ్రమనే ఆయుధాలుగా చేసుకుని సంవత్సరాల పాటు కృషి చేసిన ఫలితమే ఈ విజయమని అతని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.గ్రామీణ ప్రాంతం నుంచి ఇంతటి ర్యాంక్ సాధించడం యువతకు ప్రేరణగా నిలుస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.హర్షవర్ధన్ విజయంపై గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. బంధుమిత్రులు, పరిచయస్తులు అభినందనలు తెలియజేస్తూ అతని భవిష్యత్తు మరింత వ్రలంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు. రాబోయే జేఈఈ అడ్వాన్స్డ్ లోనూ ఇదే జోష్ కొనసాగించి ఐఐటీలో సీటు సాధించాలని అందరూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అవినీతి బయటపడుతుందని ప్రభుత్వంపై ఆరోపణలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**డేటు రాసి పెట్టుకో ఈ నియోజకవర్గానికి మళ్లీ నేనే ఎమ్మెల్యేను రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే అని, మీ పని అయిపోయిందని వచ్చేది బిఆర్ఎస్ అంటున్న ప్రతిపక్ష పార్టీ నాయకులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సవాల్ విసిరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి బయటపడుతుందని భయంతోనే ప్రభుత్వంపై ప్రతిపక్షాలు టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా 2 లక్షల రుణమాఫీ లాంటి అనేక సంక్షేమ పథకాలతో పాటు సన్న బడ్లకు 500 బోనస్ ఇచ్చి రైతులను ఆదుకున్న ఘనమైన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వం దని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పై టెక్నికల్ కమిటీ నివేదిక అనంతరం ప్రజాధనం వృధా కాకుండా ప్రాజెక్టును పున నిర్మాణం చేపట్టి రైతులకు నీరు అందించడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పథకాల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారని ప్రతిపక్షాలు అనడం కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృధా చేసిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఆని,ఆ మాట మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీ ఆరోపణలు చేస్తుందని మండిపడ్డారు. ఇప్పుడు డేట్ రాసి పెట్టుకో మళ్లీ అసెంబ్లీలో ఎమ్మెల్యే నేనే, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేశ ప్రధాని రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని సత్యనారాయణ రావు ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, పార్టీ నాయకులు అజ్మీర జంపయ్య, ఎన్ఎస్యుఐ నాయకులు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులకు మద్దతుగా బిఆర్ఎస్ నిరసనలు



**ప్రజాపక్షం/ నర్సంపేట:** మొక్కజొన్న రైతుల సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రేపు నెక్కొండ, నర్సంపేట, నల్లబెల్లి మండలాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు.మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లకు ప్రభుత్వం జీవో జారీ చేయకపోవడం, కొనుగోలు కేంద్రాలను పెంచకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గతంలో 42 కేంద్రాలు ఉండగా ప్రస్తుతం కేవలం 6 కేంద్రాలకే పరిమితం చేయడం వల్ల కొనుగోళ్లు నిలిచిపోయాయని పేర్కొన్నారు. మద్దతు ధర రూ.2400 ఉన్నప్పటికీ రైతులు ప్రైవేట్ వ్యాపారులకు రూ.1600 1800కు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గన్ని సంచుల కొరతతో తీవ్ర ఎండల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను పెంచి, మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/ నర్సంపేట:** ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా నర్సంపేటలోని విజ్డమ్ పాఠశాలలో స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సయ్యద్ జావిద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణపై సందేశాలు అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గిరగాని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ “మన శక్తి మన భూమి” అనే నినాదంతో భూమిని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. భూతాపం, కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రిసోర్స్ పర్సన్ బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ భూమిపై జీవరాశి మనుగడకు పర్యావరణ సంరక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి సంరక్షణ, మొక్కలు నాటడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతిభ సంస్థ ప్రతినిధి బోయిని వెంకటస్వామి మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి సారాన్ని కోల్పోతుందని, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో “నెల తల్లి” పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖలో వేధింపుల కలకలం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**అన్నయ్య అంటూ రాఖీ కడితే, మృగం లా మారి నన్ను శారీరకంగా వాడుకొని నా జీవితాన్ని నాశనం చేసి నన్ను ఇబ్బందులకు గురి చేస్తున్నాడంటూ ఓ మహిళ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకొని చనిపోయిన ఘటన ఇప్పుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలకలం సృష్టిస్తోంది. భూపాలపల్లి జిల్లాలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సంగీత మంగళవారం వరంగల్ నగరంలోని తన నివాసంలో ఇంటిలో ఎవరు లేని సమయంలో ఆత్మహత్య కు పాల్పడ్డారు. అన్నా అని రాఖీ కడితే నన్ను శారీరకంగా వాడుకొని నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, ఆ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు సంగీత తెలిపారు. నా చావుతో అయిన ఆ వ్యక్తి కి శిక్ష పడాలని సూసైడ్ నోట్ లో రాసి ఉంది. మరింత లోతుగా దర్యాప్తు చేపడితే అసలు విషయాలు తెలిసే అవకాశం ఉంది.

## దాతల సహకారం మరువలేనిది



**ప్రజాపక్షం/మంగపేట :**మండలం లోని కమలాపురం గ్రామానికి చెందిన బందెల లక్ష్మి ఆరోగ్యం బాగోలేక ఇటీవల మృతి చెందింది. వీరిది చాలా బీద కుటుంబం ఎవరు లేరుబందెల లక్ష్మి కుమారుడు యాక్సిడెంట్ లో చనిపోయాడు కోడలు బయట పని చేస్తూ పిల్లలను ఈమెను చూసుకుంటుంది. కనీసం ఉండటానికి ఇల్లు కూడా లేదు ఈమె దహణసంస్కారాలు చేయడానికి కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని తెలుసుకున్న జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ వారు వాట్సాప్ గ్రూపుల లో విషయాన్ని పోస్ట్ చేశారు. వాట్సప్ గ్రూపులలో ఉన్న వారు కొంతమంది దాతల సహకారంతో బుధవారం దశదిన కర్మలు ఉండటంతో దాతల దగ్గర నుంచి సేకరించిన 22500 రూపాయలు బందెల లక్ష్మి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ మాట్లాడుతూ, ఈ విషయం గురించే కాకుండా ఎవరికైనా ఆపద ఉంది అని జ్వాలా ట్రస్ట్ దృష్టికి వస్తే కచ్చితంగా మా జ్వాలా ట్రస్ట్ దాతల సహకారంతో సహాయ సహకారాలు అందిస్తుందని ఇప్పటి వరకు ప్రతీ ఒక్క కార్యక్రమానికి సహాయం అందించిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా మా జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ తరుపున నా పాదాభివందనం తెలియజేస్తున్నాం అంతేకాకుండా సహాయం అని అడిగిన వారికి మీకు తోచినంత సహాయం అందించాలని మనం చేసే సహాయం ఆ దేవుడు మనకు తిరిగి ఏదోఒక రూపంలో తిరిగి ఇస్తాడు మనం చేసే చిన్న సహాయం వారికి అది చాలా పెద్దదని దాతలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, గౌరవసలహాదారులు సోమేపల్లి భార్గవ్ చౌదరి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## కోతుల బేడదకు ‘చింపాంజీ’ పరిష్కారం

**ప్రజాపక్షం/నెక్కొండ:**సాధారణంగా కోతుల బేడదను ఎదుర్కొనేందుకు ఉచ్చులు, బోనులు, అటవీశాఖ సహాయం వంటి మార్గాలను ఆశ్రయిస్తారు. కానీ నెక్కొండ గ్రామపంచాయతీ మాత్రం సమస్యను వినూత్నంగా చూడటమే కాకుండా, ఆచరణలోకి దింపి అందరి దృష్టిని ఆకర్షించింది.పట్టణంలో కోతుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఇళ్లపై దాడులు, ఆహార పదార్థాల నాశనం, ప్రజల్లో భయాందోళనలు రోజువారీ ఘటనలుగా మారాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ సరికొత్త ఆలోచనతో ము ందుకొచ్చారు. కోతులను భయపెట్టేందుకు చింపాంజీ వేషధారణలను ఉపయోగించే విధానాన్ని ప్రవేశపెట్టారు.పంచాయతీ సిబ్బంది ఈ వేషాలు ధరించి కోతుల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తిరుగుతూ వాటిని తరిమివేయడం ప్రారంభించారు. సహజంగా తమకంటే పెద్ద జంతువు ఉందన్న భావనతో కోతులు వెనక్కి తగ్గుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ వినూత్న ప్రయత్నం తక్షణ ఫలితాలను ఇవ్వడంతో ప్రజలు ఊరట వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సింగం శ్రావణిప్రశాంత్, వార్డు సభ్యులు మెరుగు విజయ్, జెండా రవి, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అటవీశాఖతో సమన్వయం చేసుకుంటూ మరిన్ని చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.సాధారణ సమస్యకు సృజనాత్మక పరిష్కారం చూపిన నెక్కొండ పంచాయతీ చర్యలు ఇతర గ్రామాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

## ప్రపంచ విప్లవోద్యమ చుక్కాని కామ్రేడ్ లెనిన్

### సిపిఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సిపిఎం హనుమకొండ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ వ్లాదిమిర్ లెనిన్ జయంతి కార్యక్రమం సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ లెనిన్ చూపిన మార్గం శ్రామిక వర్గాల విముక్తికి, సామాజిక సమానత్వ సాధనకు ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.లెనిన్ ఆలోచనలు ప్రపంచవ్యాప్తంగా శ్రామిక వర్గాలకు మార్గదర్శకంగా నిలిచాయన్నారు. వ్లాదిమిర్ లెనిన్ నాయకత్వంలో స్థాపించబడిన తొలి శ్రామిక రాజ్యం సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి పునాది వేసింది. ఈ సిద్ధాంతాల ప్రభావం భారతదేశంలో కూడా స్పష్టంగా కనిపించి, వివిధ దశల్లో కమ్యూనిస్టు ఉద్యమాలు విస్తరించాయన్నారు. కార్మికులు, రైతుల హక్కుల కోసం సాగిన పోరాటాలకు లెనిన్ సిద్ధాంతాలు దిశానిర్దేశం చేశాయన్నారు.ఆనాడు లెనిన్ యువతరం కలల నాయకుడిగా నిలిచారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ఉరికొయ్యలను ముద్దాడిన భగత్‌సింగ్ కూడా లెనిన్ తాత్విక భావాల పట్ల ఆకర్షితులయ్యారు. భగత్ సింగ్‌కి ఉరిశిక్షను అమలు చేసే ముందు జైలు అధికారులు చివరి కోరిక ఏమిటని అడగ్గా ‘‘నేను లెనిన్ జీవిత చరిత్రను చదువుతున్నాను. అది పూర్తిచేయాలనేదే నా కోరిక’’ అని భగత్ సింగ్ చెప్పిన మాటలు ఆనాటి నుంచి నేటి వరకు యువతరం గుండెల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయని గుర్తు చేసారు. ఎన్ని తరాలు మారినా, మరెన్ని వక్ర భాష్యాలు, సిద్ధాంతాలు ఉద్భవించినా ప్రపంచగమనాన్ని మార్చిన వ్యక్తులను ఎవ్వరూ విస్మరించలేరని, మానవజాతి మనుగడ కొనసాగినంత వరకూ, దోపిడీ, పీడనలు తొలగిపోయి, ఎటువంటి వివక్షకూ తావులేని సమసమాజం ఆవిష్కృతం అయ్యేవరకు లెనిన్ అనే మూడక్షరాలు యావత్ సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోట్ల చక్రపాణి, జిల్లా కమిటీ సభ్యులు టి.ఉప్పలయ్య, ఎల్ దీప, డి.భాను నాయక్, నాయకులు ఎం.రమాదేవి, పాండురంగ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను ఆదుకోవడమే ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ లక్ష్యం

**ప్రజా పక్షం/రాయపర్తి :** మండలలోని తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు గాజు సోమయ్య, గజవెల్లి మల్లికాంబ, గూడూరు బాలరాజు, మైలారం గ్రామానికి చెందిన కాంచనపల్లి రేణుక ఇటీవల అనారోగ్యంతో మరణించగా బుధవారం బాధిత కుటుంబాలను ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, దేవరుప్పుల మండల పార్టీ నాయకులు ఏలే సుందర్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, బొమ్మినేని సురేందర్ రెడ్డి, సంకినేని ఎల్లస్వామి,గ్రామ పార్టీ అధ్యక్షులు దోకుడు దేవేందర్,మాజీ ఉప సర్పంచ్ గుడి యుగేందర్ రెడ్డి,మైబు రెడ్డి, వశపాక మారయ్య, చిన్న యాకయ్య, గట్టు, గజావెల్లి రాజు, వశపాక విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## నెక్కొండలో ఎంఆర్‌పిఎస్ టిఎస్ అత్యవసర సమావేశం

**ప్రజాపక్షం/నెక్కొండ:** స్థానిక నెక్కొండలో ఎంఆర్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ ఈదునూరి యాకయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఇప్పటికీ సామాజిక, ఆర్థికంగా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.భూముల విషయంలో అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, దళితులకు గతంలో కేటాయించిన పంచరాయి, పోరంబోకు భూములకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించలేదని పేర్కొన్నారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటి ంచిన నిరుద్యోగ భృతి, అంబేద్కర్ అభయహస్తం, రాజీవ్ యువశక్తి వంటి పథకాలు అ మలు కాలేదని విమర్శించారు. డిమాండ్లు నెరవేర్చకపోతే రాబోయే ఎ న్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐ క్యంగా తగిన నిర్ణయం తీసుకుంటారని హె చ్చరించారు.

## గిరిజన విద్యార్థులకు సువర్ణావకాశం

**ప్రజాపక్షం/ వరంగల్:** గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 202627 విద్యాసంవత్సరానికి "బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్" నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పథకం ద్వారా 3వ, 5వ, 8వ తరగతుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలలోపు ఉండాలని నిబంధన ఉంది. మొత్తం 32 సీట్లలో 3వ తరగతికి 16, 5వ తరగతికి 8, 8వ తరగతికి 8 సీట్లు కేటాయించగా, వాటిలో 33 శాతం సీట్లు బాలికలకు కేటాయించారు. అభ్యర్థులు కుల, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు, బోనఫైడ్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు జతచేయాలి. ఈ అవకాశాన్ని అర్హత గల గిరిజన విద్యార్థులు వినియోగించుకోవాలని ఐటిడిఏ, ఏటూరునాగారం ప్రాజెక్ట్ అధికారి సూచించారు.

## మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి



**ప్రజాపక్షం/ములుగు:** మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు యువతకు విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా అదనపుకలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సంబంధిత అధికారులను ఆదేశించారు బుదవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి నార్కోటిక్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి నిర్వహించారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి శాపంగా మారిన మాదక్రదవ్యాలు వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు యువత విద్యార్థుల వ్యసనాల బారిన పడకుండా పోలీస్ ఎక్సైజ్ విద్యాశాఖలు ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు జిల్లాలో గంజాయి సాగు విక్రయాలు అక్రమ రవాణాకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు ములుగు సామాజిక ఆసుపత్రి లో ప్రత్యేకంగా డి అడిక్షన్ కేంద్రం అందుబాటులో ఉందని మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రత్యేక వైద్య నిపుణలతో సైకాలజిస్ట్ తో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో డీ ఎస్పీ కిషోర్ కుమార్ జిల్లా విద్యాశాఖాధికారి సిద్ధార్థ రెడ్డి జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత డీఏఓ డీసీఓ కలెక్టరేట్ పర్యవేక్షకుడు మహేష్ బాబు ఎక్సైజ్ శాఖ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులు సామాజిక సేవలో ముందుండాలి

### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వయోవృద్ధులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.బుధవారం హనుమకొండ జడ్పీ హాల్ ప్రాంగణంలో ఉన్న వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హనుమకొండ ఆధ్వర్యంలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ (టెస్కాన్), హైదరాబాద్ సౌజన్యంతో రాగి జావ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, వయోవృద్ధులు డే కేర్ సెంటర్లలో అందుబాటులో ఉన్న పుస్తక పఠనం, ఫిజియోథెరపీ, వినోద కార్యక్రమాల వంటి సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. తమ జీవిత అనుభవాలను, వివిధ రంగాల్లోని జ్ఞానాన్ని సమాజానికి పంచాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో కలిసి కూర్చొని మాట్లాడుకునే అవకాశం ఉందని, చెస్, క్యారమ్ వంటి ఆటలు, ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణిలో సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ డే కేర్ సెంటర్‌లోని సేవలను పరిశీలించగా, నిర్వాహకులు వివరాలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ, వయోవృద్ధులకు చట్టపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం వరంగల్ అధ్యక్షులు, కార్యదర్శులు అన్సారి చంద్రమౌళి, దేవాచారి, బన్నూ ఆరోగ్యదా సేవా సొసైటీ కార్యదర్శి కిరణ్మయి, సి.డబ్ల్యూ.సి సభ్యులు కజాంపురం దామోదర్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు నాగులగాం నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, కోన్ రెడ్డి మల్లారెడ్డి, సిరాజుద్దీన్, నీతా, శ్రీధర్, హసన్‌పర్తి, కాకతీయ యూనివర్సిటీ ప్రాంత సీనియర్ సిటిజన్స్ సంస్థల ప్రతినిధులు, వివిధ సంస్థల బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

## నార్లాపూర్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

### గ్రామ కాంగ్రెస్ నాయకుల,గ్రామస్తుల వినతి





**ప్రజాపక్షం /నడికూడ :** నడికూడ మండలం నార్లాపూర్ గ్రామ పాఠశాల అభివృద్ధి కోసం వీరేశలింగం సలహా మేరకు ఆరుట్ల గ్రామం మంచాల మండలం రంగారెడ్డి జిల్లాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రెస్ మీట్ నిర్వహించి గ్రామ కాంగ్రెస్ నాయకులు పరకాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈర్ల చిన్ని,ఈర్ల సాంబయ్య మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ సందర్శించి ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉంది,ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో నిర్వహించబడుతుందని ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే విద్య బోధన జరుగుతుందని ఇలాంటి స్కూల్ ను మా నార్లపూర్ గ్రామంలో ఏర్పాటు చేయాలని అరుట్ల గ్రామంలో ఉన్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ దానిని ఆదర్శంగా తీసుకొని మా గ్రామంలో కూడా ఇలా చేసుకుంటే బాగుంటుందని మేమందరం నిర్ణయానికి రావడం జరిగిందని టిపిఎస్ లో ఒకసారి అడ్మిషన్ తీసుకుంటే ఇంటర్ వరకు విద్యా బోధన అందించబడుతుందని,పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చొరవ తీసుకొని సహకరిస్తే మేం ఊరిలో ఉన్న సుమారుగా రెండు ఎకరాల భూమిని అందరి సహకారంతో కొనుగోలు చేసి చుట్టూ ఉన్న గ్రామాలు కూడా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసుకొని ఆ స్కూలు విజయవంతంగా నిర్వహించుకుంటాం.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరకాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈర్ల చిన్ని,ఈర్ల సాంబయ్య,నాగపురి సారంగపాణి,శనిగరపు శ్రీధర్,కె. శ్రీనివాస్,ఓరుగంటి రాజయ్య, ప్రతాపరెడ్డి, సమ్మక్క, విజయ గ్రామస్తులు పాల్గొన్నారు.

## పీడిత ప్రజల విముక్తికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధమే మార్గం

**ప్రజాపక్షం/ వరంగల్:** పీడిత ప్రజల విముక్తికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధమే మార్గమని సిపిఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు పేర్కొన్నారు. ఇరాన్ ప్రజల ప్రతిఘటన పోరాటానికి సంఘీభావం తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ పార్టీ 57వ ఆవిర్భావ దినోత్సవం, లెనిన్ 156వ జయంతి సందర్భంగా ఖిలా వరంగల్ పడమర కోట సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ జెండా ఎగురవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో బాలరాజు మాట్లాడుతూ, దేశంలో నిజమైన స్వాతంత్రం కోసం ప్రజా ఉద్యమాలు బలపడాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలను విమర్శిస్తూ, మధ్యప్రాచ్య దేశాలపై దాడులను ఖండించారు. ఇరాన్ ప్రజలు తమ సార్వభౌమాధికారాన్ని కాపాడుకునే పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు. ఇతర నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ అనుకూలంగా మారాయని, కార్మిక హక్కులను బలహీనపరిచే చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మార్క్సిజం,లెనినిజం, మావో భావజాలమే విముక్తి మార్గం

**ప్రజాపక్షం/ నర్సంపేట:** దేశ విముక్తికి మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన విధానాల వెలుగులో ప్రతిఘటన పోరాటాలే సరైన మార్గమని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్ పేర్కొన్నారు. సిపిఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవం, లెనిన్ జయంతి సందర్భంగా నర్సంపేటలోని పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ నాయకుడు ఆకుల వెంకటస్వామి జెండాను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ, కార్పొరేట్ అనుకూల నిర్ణయాలు ప్రజలకు నష్టకరమని పేర్కొన్నారు. పేదలకు భూమి, హక్కులు సాధించేందుకు పార్టీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుల ఆర్థిక అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**రాయపర్తి/ ప్రజా పక్షం :** రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని వర్దన్నపేట మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో పాక్స్ రాయపర్తి, మండలంలోని కొండూరు, జయరాం తండ(కే), కేశపురం గ్రామాలలో కొలనుపల్లి పాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి నీరజ తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రైతులు దలారులను నమ్మి మోసపోవొద్దని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధన్యాన్ని అమ్ముకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గారే సాహెంద్ర బిక్షపతి, రాయి ని యాకయ్య, లావుడియా శిల్పనరేష్,గుజే సుధాకర్,రాయపర్తి పాక్స్ స్పెషల్ ఆఫీసర్ కీరు నాయక్,కొలనుపల్లి పాక్స్ స్పెషల్ ఆఫీర్ కనకదుర్గ,సొసైటీ అధ్యక్షులు రాజు,ఏఈవో లు మనస్విని,కావ్య,పాక్స్ సీఈఓలు సోమిరెడ్డి, యాదగిరి, పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం-మమత

**ప్రజాపక్షం/కొడకండ్ల:** ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రభుత్వం పనిచేస్తుందని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు, దోమల నివారణ కోసం ఏసీఎం స్ప్రేను అందరి ఇండ్లలో కొట్టించే కార్యక్రమం స్థానిక వైద్య సిబ్బందితో కలిసి వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దోమల వల్ల అనేక రోగాలు వస్తాయని వాటి నివారణ కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఎండీ షన్ను, ఏఎన్ఎం సదమ్మ, ఆశలు, యాకమ్మ, ధన లక్ష్మి, శారద, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/కొడకండ్ల:** ఐకేపీ ద్వారా మండల కేంద్రంలో ప్రారంభించినటువంటి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్, తహశీల్దార్ అనిల్ బాబుతో కలిసి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాల మేరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరిగిందన్నారు. కావున రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుండా కొనుగోలు కేంద్రంలో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరక్టర్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం




**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఆరుణ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఎండాకాలం సెలవులు నేపథ్యంలో విద్యార్థుల తలిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలన్నారు. ఎండ తీవ్రత వల్ల ఎండ దెబ్బ తలిగే అవకాశం ఉందని పిల్లలను బయటకు పంపించకుండా ఇండ్లలోనే చదువుకునేలా చూడాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, బాలమణి, శ్రీలత, విద్యార్థులు తల్లిదండ్రులు ఉన్నారు.

## రజాక్‌పల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని రజాక్ పల్లి గ్రామంలో ప్రాథమిక వ్యసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని రజాక్ పల్లి సర్పంచ్ కనకరాజు, ఖాసింపూర్ తాండా సర్పంచ్ రాంచందర్ నాయక్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ మల్లారెడ్డి, రజాక్ పల్లి ఉపసర్పంచ్ రమేష్, వార్డు మెంబర్స్ నవీన్, కనకవ్వ, రాజు, శ్రీకాంత్, స్వామి, సంధ్య, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఏఓ

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డ్ లో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించేటప్పుడు రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. అలాగే వర్ష సూచనలను అనుసరించి ధాన్యం తడవకుండా తగిన చర్యలను చేపట్టాపలని రైతులకు వివరించారు. వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సోసైటీ సిబ్బందికి సూచనలు చేశామన్నారు.

## తల్లిదండ్రుల పేరుతో ఉచిత అంబలి పంపిణీ

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో పాతూరి రజిని, మహమ్మద్ అమీనా బేగం ఆధ్వర్యంలో బుధవారం రోజున మార్కెట్ ఆవరణలో వారి తల్లిదండ్రుల పేరు మీద అంబలిని పంపిణీ చేశారు. ప్రతిరోజు స్కూలు గేటు ఆవరణలో అంబలి ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకోని వృద్దులకు పిల్లలకు అందరికీ అంబలి పంపిణీ చేయడం వల్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాతూరి రజిని, మహమ్మద్ అమీనా బేగం వార్డు మెంబర్ రేణుక, సులేమాన్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన పోరాటానికి సిపిఐ మద్దతు

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జేరిపొతుల జనార్ధన్ .



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** ఏప్రిల్ 22 . తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తమ డిమాండ్ల సాధన కోసం ఆర్‌టిసి కార్మికులు చేపట్టిన సమ్మెకు భారతకమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని సిద్దిపేట జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్ధన్ తెలిపారు. బుధవారం హుస్నాబాద్ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెఆయన హజరై సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ ఆర్టీసీని కాపాడుకోవటం అంటే ప్రజలను కాపాడుకోవడమేఆని అన్నారు. కార్మికులు ఆడుగుతున్న డిమాండ్లు అన్ని న్యాయపరమైనవే నని వారి మరుగడకు సంబందించినవి అన్నారు. ఏళ్ల తరబడి పెండిగ్‌లో ఉన్న డిమాండ్లను కార్మికులను చర్చలకు పిలువకుండ కాయాపని చేయడం సరైంది కాదని వెంటనే వారితో చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కారించాలని కొరారు. కార్మికుల సమస్యల సాధన కొసం సిపి ఐ పార్టీ ఎల్లవేళల ఆండగా ఉంటుందని పేర్కోన్నారు. కార్మికుల 32 డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె కేవలం వారి కోసం కాకుండ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటు వంటి ప్రజలకు కొసం ప్రభుత్వం ఆలోచించాలని అన్నారు. హుస్నాబాద్ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ చోరవ చూసి సమస్యను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు పాల్గోన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

### టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి



**ప్రజాపక్షం/జనగామ :** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి డిమాండ్ చేవారు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం చేయనున్న భవనానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఫెడరేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు అధ్యక్షత వహించగా చావ రవి మాట్లాడారు. ప్రభుత్వం విజ్ఞతతో వ్యవహరించి 2024 మార్చి నుండి రిటైర్ అయిన 12వేల మంది ఉద్యోగు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఏకైక మొత్తంగా పది వేల కోట్లు కేటాయించి పెండింగ్ బిల్లులు అన్నింటిని క్లియర్ చేయాలన్నారు. జిపిఎస్, సిపిఎస్ డిఎ బకాయిలువిడుదల చేయాలన, బకాయి ఉన్న నాలుగు విడుతల డిఎను ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల సర్వీర్ నిబంధనలను రూపొందించి పర్యవేక్షణ అధకారులుగా పదోన్నతులు ఇవ్వాలన్నాను. జనగామలో నిర్మాణం చేస్తుస్తున్న భవన్ ఉపాధ్యాయుల సర్వీస్ కేంద్రంగా, చైతన్య ఉద్యమ కేంౢదంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకట్ మాట్లాడుతూ 2003 డిఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని, కెజిబివి సమగ్ర శిక్షా ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని, మోడల్ స్కూల్, గురుకులాల ఉద్యోగులకు 010 హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మదూరి వెంకటేష్, ఆకుల శ్రీనివాసరావు, మంగు జయ ప్రకాష్, శ్రీనివాస్,పెండెం రాజు, తాటికాయల కుమార్, సుజన్ ప్రసాద్, యాదవరెడ్డి, కృష్ణమూర్తి, మర్రెడ్డి జ్యోతి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

### ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**ప్రజాపక్షం/కమలాపూర్:** వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రక్రియ పారదర్శకంగా జరగాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అధికారులను కోరారు. కమలాపూర్ మండల కేంద్రంతో పాటు గూడూరు, ఉప్పల్ గ్రామాల్లో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించారు. గూడూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ప్రాథమిక సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, కమలాపూర్ గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం, మర్రిపెల్లి గూడెం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులకు యూరియా పంపిణీ విధానంలో యాప్ ను వినియోగిస్తున్నట్లే, రైతులు వరి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియను కూడా ట్రాక్టర్లకు జీపిఆర్ఎస్ అమర్చి యాప్ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ చార్జీలుగా క్వింటాల్ కు రూ. 36 చెల్లిస్తున్నప్పటికి, కాంట్రాక్టర్లు కేవలం రూ. 15 మాత్రమే ఇస్తున్నట్లు రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ అంశం పై జిల్లా కలెక్టర్ స్పందించి రైతులకు పూర్తిస్థాయిలో రవాణా చార్జీలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో శ్రీనివాస్, ఏపిఓ లలితా దేవి, ఎంపిడివో గుండె బాబు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఝాన్సీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# మనవాగు మన జీవనాధారం

### ధూల్మిట్ట సర్పంచ్ గునుకుల లీల జగన్‌మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** ప్రకృతి పరమైన సహజ వనరులైన త్రాగు, సాగు నీరును అందిస్తున్న వాగులను కాపాడితేనే భవిష్యత్ తరాల ప్రజలకు భద్రత ఉంటుంది. ఎక్కడైనా సరే అక్కడ సహజవనరులను మరోప్రాంత ప్రజల సౌకర్య కోసం తరలిస్తే అక్కడి సహజవనరులను దోచుకోవడమే అవుతుంది. సిద్దిపేట జిల్లాలో మిట్ట ప్రాంతమైన ధూల్మిట్ట మండల కేంద్రంలోని గ్రామ ప్రజలతో పాటుగా, రైతుల జీవనాధారానికి ఇక్కడి మొయతుమ్మెద వాగు ముఖ్యపాత్ర పోషిస్తోంది. మండు వేసవిలో రోజురోజుకు ఇక్కడ భూగర్భ జలాలు అడుగంటుక పోతుంటే, ఇలాంటి సమయంలో ఇక్కడి సహజ వనరైన ఇసకను ప్రభుత్వ పథకాలపేరుతో ఇతర ప్రాంతాల ప్రజల అవసరాల నిమిత్తం అక్రమంగా వేల సంఖ్యలలో ట్రాక్టర్ల ద్వార ఇసుకను తోడుతు ఎడారిగా మారుస్తున్నారు. ధూల్మిట్ట వాగు నుండి ఇతర గ్రామాలకు ఇసుక తరలింపుకు పర్మిషన్ ఇవ్వకూడదని బుధవారం గ్రామ ప్రజలతో పాటుగా వివిధ పార్టీలకు చెందిన ప్రముకులతో కలసి ధూల్మిట్ట తహశీల్దార్ ఎర్రోళ్ల శ్యామ్‌కు ధూల్మిట్ట గ్రామ సర్పంచ్ గునుకుల లీలా జగన్‌మోహన్ రెడ్డి, ధూల్మిట్ట గ్రామ మాజీ సర్పంచ్ దుబ్బుడు దీపిక వేణుగోపాల్ రెడ్డితో పాటుగా గ్రామస్థులతో కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇక్కడి రైతులకు జీవనాధారంగా, పంటలకు సాగునీరు అందిస్తూ అన్నం పెడుతున్న వాగును, ప్రాంత ప్రజలదాహార్థిని తీరుస్తున్న వాగును ఎడారిగా మారుస్తే చూస్తూ ఉరుకోమని హెచ్చరించారు. అవసరమైయితే ప్రజలతో కలసి పోరాటం చేయడానికైన సిద్దాంగా ఉన్నామని పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయితీ వార్డు సభ్యులతో పాటుగా రైతులు, గ్రామ యువత పాల్గొన్నారు.




## తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

### కలెక్టర్ కె.హైమావతి

**ప్రజాపక్షం/కొమురవెల్లి:** అకాల వర్షాలు వచ్చే ఆస్కారం ఉన్నందున వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తక్షనమే కొనుగోలు చేయాలని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు.బుధవారం కొమురవెల్లి మండల పరిధిలోని మరి ముస్యాల,గౌరయపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సంధర్భంగా కక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం దాదాపు 419 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొదలైందని తెలిపారు.రైతులు వరి కోత చేయగానే కొనుగోలు కేంద్రానికి తీసుకురాకుండా వ్యవసాయ క్షేత్రంలోనే తేమ శాతం వచ్చే వరకు ఆరబెట్టుకోని కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. కేంద్రాల్లో గన్నీ బ్యాగులు,తేమ శాతం కొలిచే యంత్రాలు,కంతాల పాడి క్లీనర్లు,మౌళిక సదుపాయాలు,ఆకాల వర్షాల వలన వరా ధాన్యం తడవకుండా టార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.మిలుల్లు కేటాయించలేదని పలువురు రైతులు కలెక్టర్‌కు తెలుపడంతో వారం కిందనే మిల్లులు కేటాయించడం పూర్తయిందని పేర్కొన్నారు.తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగెలు చేయాలని మండల ఏపిఎంలకు ఫోన్ ద్వారా ఆదేశించారు.

## చౌడాలమ్మ దేవాలయాన్ని సందర్శించిన దరిపల్లి చంద్రం

**ప్రజాపక్షం/సిద్ధిపేట అర్బన్:** సిద్ధిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం విఠలాపూర్ గ్రామంలోని చౌడాలమ్మ దేవాలయంను గ్రామ సర్పంచ్ దాసరి ఎల్లయ్యతో కలిసి టిపిసిసి మెంబర్ దరిపల్లి చంద్రం బుధవారం సందర్శించారు. చౌడాలమ్మ వార్షికోత్సవం మే నెల 6వ తేదీ నుండి 9వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో దరిపల్లి చంద్రంను మర్యాదపైర్వకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు తిరుపతి,డైరెక్టర్లు తదితరులు పాల్గోన్నారు.

## రేణుక ఎల్లమ్మ దీవెనతో అన్నింటా మంచి జరగాలి

**ప్రజాపక్షం/సిద్ధిపేట అర్బన్:** మిట్టపల్లి గ్రామం అభివృద్దిలో కల్పవల్లి అని,పది సంవత్సరాలలో గ్రామాన్ని అభివృద్దిలో దేశానికి ఆదర్శంగా నిలిపామని మాజీ మంత్రి సిద్దిపేట ఎంఎల్ఎ తన్నీరు హరీష్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి గ్రామంలో జరిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణోత్సవంలో మాజీ మంత్రి సిద్దిపేట ఎంఎల్ఎ తన్నీరు హరీష్‌రావు పాల్గోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారి దయతో అన్నింటా మంచి జరగాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల రైతులకు,గౌడన్నలకు ఇబ్బంది అవుతుందంటే 47లక్షలతో ఫీడర్ చానల్ వద్ద బ్రిడ్జ్ మంజూరి చేసుకున్నామన్నారు. త్వరలోనే దేవాలయానికి ప్రహరీగోడ,సిసి ప్లాట్‌ఫామ్,రాజీవ్ రహదారి నుండి మిట్టపల్లి గ్రామం వరకు డబుల్ రోడ్డు,బ్రిడ్జ్ నిర్మాణం చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, సర్పంచ్ చింతల శ్రీనివాస్ యాదవ్,మాజీ సర్పంచ్ పయ్యావుల రాములు,కిషన్,శ్రీహరి యాదవ్,జాప శ్రీకాంత్‌రెడ్డి, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి,గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

## జనగణన శిక్షణ ఉదయం 8-1:00 వరకు నిర్వహించాలి

**ప్రజాపక్షం/పాపన్నపేట:** తీవ్రమైన ఎండల దృష్ట్యా జనగణన శిక్షణ తరగతుల సమయాన్ని ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించవలసినదిగా పాపన్నపేట మండల తహసిల్దార్ కు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మెమోరాండం సమర్పించారు. అంతేకాకుండారేపు విద్యా సంవత్సరం చివరి పని దినం ఉన్నందున రేపటి జనగణన శిక్షణ తరగతులను మరుసటి రోజుకు వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ అధ్యక్షులు పైతర దుర్గాప్రసాద్, టిపిటిఎఫ్ అధ్యక్షులు బాలరాజ్, ఎస్టియూ అధ్యక్షులు ఎల్లం, టిఎస్యూటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎండి రఫీ, సభ్యులు ఎం.శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## కుర్తివాడ పాఠశాలలో సరస్వతి మాత విగ్రహావిష్కరణ

**ప్రజాపక్షం/పాపన్నపేట:** మండల పరిధిలోని కుర్తివాడ పాఠశాల ఆవరణలో సరస్వతి మాత విగ్రహావిష్కరణ చేశారు. ప్రధానోపాధ్యాయులు మేగ్యనాయక్ ఆర్థిక సహాయం తో విగ్రహ ఆవిషరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెలలో ఆయన పదవి విరమణ చేయనున్నందున ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ శ్రీధర్, నాయకులు రమేష్ గౌడ్, పుట్టి కిరణ్, కొత్తూరి శ్రీనివాస్, అనిల్, యేసయ్య తదితరులు పాల్గొన్నారు. వేద పండితులు రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** రైతులు తమ వరిధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మధుకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడి సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే వాహనదారులకు కనిపించక ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించిన కొనుగోలు కేంద్రాలలో లేదా కల్లాల్లో మాత్రమే ఆరబోసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు




-కొండాపూర్ తహసీల్దార్ అశోక్

**ప్రజాపక్షం/కొండాపూర్ :** వేసవి కాలం ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని నిత్యం వివిధ పనులపై మండల కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ అశోక్ అన్నారు. కొండాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అశోక్ ఎంపిడిఓ వేణుగోపాల్, ఆద్వర్యంలో గ్రామస్థుల సమక్షంలో బుదవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు యువకులు ,మహిళలు, తదతరులు పాల్గొన్నారు.

# ప్రాణ స్నేహితులే ప్రాణం తీశారు...

**ప్రజాపక్షం/రామాయంపేట:** ప్రాణ స్నేహితులే మరో స్నేహితుడిని హత్య చేసిన ఘటనలో ఇద్దరికి జీవిత ఖైదు శిక్షతో పాటు 30వేల జరిమాన విదించినట్లు మెదక్ జిల్లా ఎస్పి డివి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పి తెలిపిన వివరాల ప్రకారం రామాయంపేట మండల పరిదిలోని ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన నరేందర్ తన స్నేహితులైన పిట్ల పరుశురాములు, చివిటోల్ల చంద్రంతో కలిసి తరుచూ మద్యం సేవించేవారు. ఈక్రమంలో వారిమద్య తలెత్తిన విబేదాలు తీవ్రమై క్షణికావేశంలో నిందితులు నరేందర్‌పై దాడి చేసి హత్య చేసి మృతదేహాన్ని చెక్‌డ్యాంలో పడేసి ఘటనను దాచిపెట్టే ప్రయత్నం చేశారని తెలిపారు. ఈ ఘటన 2022 మే 4న వెలుగులోకి రావడంతో రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేయగా దర్యాప్తు అధికారి సిఐ చంద్రశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలంలో అదారాలు సేకరించి సాక్షులను విచారించి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ప్రస్థుత దర్యాప్తు అధికారి సిఐ వెంకటరాజాగౌడ్ పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ వాదనలు వినిపించారు. సమర్పించిన సాక్షాదారాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితులు పిట్ల పరుశురాములు, చెవిటోల్ల చంద్రంలు నేరం చేసినట్లు నిర్ధారించి ఇద్దరికి జీవిత ఖైదు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 15 వేల రూపాయల జరిమాన విదిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్పి తెలిపారు. ఈకేసులో కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్, సీడీవో భూపాల్ సహకరించారని నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పి అభినందించారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలి

కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరి



**ప్రజాపక్షం/కొండాపూర్ :** మండల పరిధిలోని మన్సాన్ పల్లి గ్రామంలో బుదవారం అరైవ్.. అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ సోమేశ్వరి ,సర్పంచ్ రాంచంద్రారెడ్డి ,గ్రామ పెద్దల సమక్షంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతకు సంబందించిన ముఖ్యమైన నియమాలను వివరించి హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం ,వేగ నియంత్రణ ,మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై ప్రత్యేకంగా సూచనలు ఇచ్చారు. అలాగే ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబందనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ,యువకులు, వాహన దారులు పాల్గొని ట్రాఫిక్ భద్రతపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని గ్రామ సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ ,ఉప సర్పంచ్ శివ శంకర్, వార్డు మెంబర్లు, పాఠశాల ఉపాద్యాయులు డ్వాక్రా మహిళ సంఘాలు అంగన్వాడీ టీచర్లు యువకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# అమీన్ పూర్, బీరం గూడ డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టాలి

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కాట శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/రాంచంద్రాపురం :** అమీన్ పూర్ ,బీరం గూడ డివిజన్లో నెలకొన్న సమస్యలపై చర్యలు తీసుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని సి.ఎం.సి కమీషనర్‌కు పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కాట శ్రీనివాస్ గౌడ్ బుదవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ మున్సిఫల్ కార్పోరేషన్ కమీషనర్ ను కలిసి 271 అమీన్‌పూర్, 270 బీరంగూడ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న ప్రధాన సమస్యలను వివరించానని, కాలనీలలో ముఖ్యంగా స్ట్రీట్ లైట్లు సక్రమంగా లేకపోవడం ,డ్రైనేజ్ వ్యవస్థ దెబ్బదినడం , రాహదారులు ,ఆద్వానంగా మారడం వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ విషయాన్ని సీ.ఎం.సి కమీషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె సానుకూలంగా స్పందించారని అభివృద్ధి పనులు చేపడతామని హామి ఇచ్చారని ఆయన తెలిపారు.

# మహిళాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**ప్రజాఫక్షం/కొండాపూర్ :** అన్ని రంగాల్లో మహిళలను అబివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రదాన లక్ష్యమని టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. బుదవారం కొండాపూర్ మండల పరిధిలోని తేర్పోల్ ఎదురు గూడెం గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజిఎస్ నిధులతో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనాలకు ఆమె భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మళా జగ్గారెడ్డి మాట్లాడుతూ మహిళలే కుటుంబానికి ,సమాజానికి బలమైన పునాది అన్నారు. వారి ఆర్థిక ,సామాజిక అభివృద్ధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి సాద్యం కాదు అన్నారు . ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సాదికారతను లక్ష్యంగా పెట్టుకుని సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి మహిళల ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపించి ,ఆమెను ఆర్థికంగా, బలంగా నిలబెట్టడం మా ప్రభుత్వ ద్యేయమని, మాటల్లో కాదు , పనుల్లోనే మహిళల అభివృద్ధిని చూపిస్తున్నాం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు,సర్పంచ్ సతీష్, కాంగ్రెస్ నాయకులు నర్సింహరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశంగౌడ్, నర్సింలు, ప్రభుదాసు , అశోక్, గోపాల్‌తో పాటు పంచాయతీ సభ్యులు ,ఐకెపి ,వీఓలు, అధికారులు ,మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నగొట్టిముక్ల, ఏదుల్లాపూర్ గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. ధాన్యం తూకం వేయడంలో జాప్యం జరగకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, సర్పంచ్‌లు నారాయణరావు, హనుమంతరావు, సీనియర్ నాయకులు గొర్రె వెంకట్ రెడ్డి, యాదాగౌడ్, హనుమంత్‌రెడ్డి, పంచమి రేణుకుమార్, మైసయ్యాయాదవ్, కల్లూరి వెంకటేష్, బాలమణి నరేందర్, మాజీ ఎంపీటీసీ నువ్వుల దశరథ, లక్ష్మ ణ్ తదితరులు ఉన్నారు.

## ఆకునూర్‌ను సందర్శించిన సిద్దిపేట పోలీస్ కమిషనర్

రష్మీ పెరుమాల్

**ప్రజాపక్షం/చేర్యాల:** ప్రజలు పోలీసుల మధ్య స్నేహపూర్వక సంబంధాలు పెంపొందిచేందుకు చేపట్టిన "మన పోలీస్ మన ఊరు కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాల్ ఐపిఎస్ చేర్యాల మండలం ఆకునూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమరాలు, గ్రామ పాఠశాలలో ఏర్పాటు చేసిన 4 సీసీ కెమరాలను సీపీ స్థానిక ప్రజలతో కలసి ప్రారంభించారు. స్థానిక శివాలంయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిక్షనరీలను, అనంతరం ఒగ్గు కళాకారులు నిర్వహించిన ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించగా, పోలీస్ కళాబృందం డ్రగ్స్ దుష్ప్రభావాలపై పాటల ద్వారా సందేశం అందించారు. ఈ సందర్భంగా వాహనదారులైన పలువురు గ్రామస్థులకు సీపీ హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పురుమాల్ ఐపిఎస్ మాట్లాడుతూ, ప్రజలు సమస్యల పరిష్కారం కోసం పోలీసులను నిర్భయంగా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అధనపు డీసీపీలు కుశాల్కర్, సుభాష్ చంద్రబోస్, ఏసీపీ సదానందం, సీఐ రమేష్, ఎస్ఐ అపూర్వరెడ్డి, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గోంన్నారు.

## మాట నిలబెట్టుకున్న సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో కోతుల బెడదతో ప్రజలు చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. పంటలు పాడవడం, ఇళ్లలోకి దూసుకెళ్లడం,చిన్నారులకు భయం కలిగించడం,ఇలా రోజువారీ జీవితం కష్టంగా మారింది.ఈ సమస్యను గమనించిన గ్రామ సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి ఎన్నికల సమయంలో ఒక హామీ ఇచ్చారు: "కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొస్తా" అని. మాట ఇచ్చి నేడు ఆ మాటను నెరవేర్చుకున్నారు గ్రామ సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి.అధికారాల కోసం ఎదురు చూడకుండా,ప్రభుత్వ నిధులు కోసం ఆలస్యం చేయకుండా..తన సొంత ఖర్చుతోనే కోతులను పట్టించే చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, గ్రామంలో తిరుగుతున్న కోతులను సురక్షితంగా పట్టించి అడవుల్లో విడిచిపెట్టే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ చర్యతో గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొంది.రైతులు ఉపశమనం పొందారు.చిన్నపిల్లలు భయపడకుండా బయట ఆడుకుంటున్నారు."మాట ఇచ్చి మరిచిపోని నాయకుడు పని చేసి చూపించిన నాయకుడు" అంటూ గ్రామస్తులు మహేందర్ రెడ్డిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.ప్రజల కోసం ముందడుగు వేసే నాయకులు ఉంటే..గ్రామాల అభివృద్ధి దూరంలో ఉండదు! అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డిని పలువురు అభినందించారు.గ్రామ ప్రజల రుణం తీర్చుకోవడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

## సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకర్షిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఆన్వల్ డే కార్యక్రమంలో బాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా వేలేరు మండలకేంద్రంలోని మండలపరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు లీలాభాయి ఆద్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్యఅథిధిగా మండవిద్యాశాఖ అధికారి మొగిళిచెర్ల చంద్రమౌళి హాజరయ్యారు .ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల కంటే విద్యలోనే కాకుండా ఆటలు,పాటలు,పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడమే కాకుండా క్రీడలలో స్థాయిలో పేరుప్రఖ్యాతులు తీసుకురావడం జరుతోందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులచే విద్యబోధన చేయడం జరుగుతోంది కనుక మీచిన్నారులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు.

## ఎంపీని కలిసిన సర్పంచ్

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** సర్పంచ్ అర్జుల జ్యోతి మధుసూధన్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఈనెల 23 నుంచి 26వ తేదీలలో జరిగే దుర్గమ్మ ఉత్సవాలకు రావాల్సిందిగా మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ బృంగి శివకుమార్, మండల జనరల్ సెక్రటరీ ఇంద్రారెడ్డి, నాయకులు రాజు, రంజిత్‌రెడ్డి, తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/తరిగొప్పుల:**మండలంలోని బొంతగట్టు నాగారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ కుర్ర మల్లయ్య బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ 2389, కామన్ గ్రేడ్ 2369, సన్న వడ్లు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, జీపీవో తిరుపతి, మహిళా సంఘం సభ్యులు శాంత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిలి జగన్మోహన్ రెడ్డి, రవి, నాయకులు జుంలాల్ నాయక్, రాకేష్, రాజు, పాల్గొన్నారు.

## ఎల్ఐసి ఏజెంట్ శ్రీను కుటుంబానికి చేయూత

**ప్రజాపక్షం/ కమలాపూర్:**ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎల్ఐసి ఏజెంట్ కుసుమ శ్రీనివాస్ కు ఎల్ఐసి ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హుజురాబాద్ బ్రాంచి, ఎస్ఓ జమ్మికుంట మెంబర్ అయినందున అతనికి అసోసియేషన్ నుండి రూ. 25 వేల ఆర్థిక సహయాన్ని అధ్యక్షులు పంజాల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చందుపట్ల నరసింహ రెడ్డి, డైరెక్టర్ కొండ తిరుపతి, సంఘ సభ్యులు వడ్డే రమేష్, నాగవెల్లి శ్రీనివాస్, బుచ్చి రాములు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసి ఉదారతను చాటుకున్నారు.

## ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత, వేగం పెంచాలి

**ప్రజాపక్షం / జనగామ :**ఉపాధి పనుల్లో పారదర్శకత, వేగం పెంచడంతో పాటు లక్ష్యాలను చేరుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. పనుల వద్ద మౌళిక సదుపాయాలు కల్పించాలన, 72 గంటల్లోనే కొలతలు నమోదు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామి పథకం ద్వారా కూలీలకు పని కల్పించ దినసరి వేతనం నిర్దేశిత సమయంలో అందెలా చూడాలన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం పనుల పురోగతి, నిర్వాహణపై ఎంపిడిఓలు, ఎంపోలు, ఏపిఓలతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనుల కొలతలు పూర్తి చేసిన తర్వాత 72 గంటల్లోనే రికార్డు నమోదు చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో పనులను తరుచుగా పర్యవేక్షించాలన్నారు. ఎంపిడిఓలు మండల స్థాయి పనితీరుకు బాధ్యత వహించాలని, పనుల వద్ద తాగునీరు, షెడ్లు, ప్రథమ చికిత్స, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మట్టి వర్గీకరణ, కొలతల ప్రక్రియలను ఖచ్చితంగా అమలు చేయాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి పనుల పురోగతిని సమీక్షించాలన్నారు. కొలత రికార్డులు, యాప్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని, పనుల నాణ్యతను గుర్తించేందుకు ఉత్తమ స్థాయిలో ఉన్న పనులను గుర్తించాలన్నారు. పనికి సరియైన వేతనం అందె విధంగా చూడాలని, పనుల ఖచ్చితత్వంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వేసవి నేపధ్యంలో ఉదయాన్నే పనులు ప్రారంభించాలన, పనుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, వారానికి రెండు సార్లు పనులకు కొలతలు వేయాలన్నారు. ఈ సమీక్షలో ఇంఛార్జీ డిఆర్‌డిఓ నూరుద్దీన్, అడిషనల్ డిఆర్‌డిఓ చంద్రశేఖర్, అన్ని మండలాల ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఏపిఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్ళలో నిర్లక్ష్యం వద్దు

**ప్రజాపక్షం/ కమలాపూర్:**కమలాపూర్ మండలం మర్రిపల్లి గూడెం, గుండెడు, ఉప్పల్, శనిగరం, మాదన్నపేట, శ్రీరాములపల్లి, నేరెళ్ళ గ్రామాలలో ఐకెపి, ఫ్యాక్స్ ఆధ్వర్యంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ మాట్లాడుతూ... ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా తూకంలో ఎలాంటి తేడాలు రాకుండా చూడాలని ఐకెపి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఏపిఎం లలితా రాణి, కాంగ్రెస్ నాయకులు బాలసాని రమేష్ గౌడ్, బొల్లం రాజిరెడ్డి, గుండపు చరణ్ పటేల్, మొండెద్దుల నాగరాజు, వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, మార్కెట్ డైరెక్టర్లు గట్టు శ్రీధర్, జనగాని శివ కృష్ణ, ఆకినపల్లి బిక్షపతి, నిగ్గుల లింగయ్య, కిన్నెర కృష్ణమూర్తి, యాకుబ్, చెరుపల్లి రామచంద్రం, అబ్బరవేణి అనిల్, చందబోయిన సాయి కుమార్, భాషబోయిన రమేష్, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ వరంగల్:** వరంగల్ నగరంలోని దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం టిబి ముక్తి భారత్ అభియాన్ రెండో విడతలు భాగంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ కుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు అలసట, తలనొప్పి, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలున్నట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి వైద్య సేవలు సలహాలు సూచనలు పాటించాలని కోరారు. వైద్య శిబిరంలో 235 మందికి రక్త పూత పరీక్షలు నిర్వహించి అందులో 104 మందికి డిజిటల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ఫుల్లీ కంప్యూటర్ చెస్ట్ ఎక్సరే పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు క్షయ వ్యాధి చికిత్స నివారణ విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ శిబిరంలో టిబి నియంత్రణ విభాగం ప్రతినిధులు నరేష్, రంజిత్, సూపర్వైజర్ పబ్లిక్ హెల్త్ మేనేజర్ జన్ను కొర్నేల్, ఫార్మసీ ఆఫీసర్ అనిల్ కుమార్, అకౌంటెంట్ స్వర్ణలత, ఏఎన్ఎంలు జ్యోతి,శోభ, అమృత, నిహారిక, సుల్తానా, కాలువాల కుమార్ , ఆశ కార్యకర్తలు సుమలత , పరిమళ, గీత, సంధ్య, మమత ,పూలమ్మ ,శ్రీవాణి, ఆడెపు జ్యోతి, జన్ను బుచ్చయ్య, మేధా నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు..




## రైతును రాజు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం,/ తొర్రూరు :** రైతును రాజు చేయడమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని వెలికట్ట, చెర్లపాలెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ధర్మారపు మహేందర్, బంధు శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యం అమ్మి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని తెలిపారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోశ్, భోజ్య తండా సర్పంచ్‌లు జాటోతు రాంలాల్, నరేందర్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, దీకొండ శ్రీనివాస్, నాగిరెడ్డి, యాకన్న, ప్రకాశ్, సుధాకర్‌రెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.



## 14 నెలల వేతనం చెల్లించడంలో అధికారులు విఫలం

**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన నీలం యాదగిరికి గత 14 నెలల నుండి వేతనం చెల్లించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విలేకరుల సమావేశంలో బోరునా విలపించారు.ఈసంధర్భంగా యాదగిరి బుధవారం గుండ్లసాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుండ్లసాగర్ గ్రామపంచాయితీలో వాటర్ మెన్‌గా విధులు నిర్వహించానని గత 14 నెలల వేతనం చెల్లిండంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆవేధన వ్యక్తం చేస్తూ నాకు వెంటనే వేతనాలు చెల్లించాలని అధికారులను గ్రామసర్పంచ్‌ను వేడుకున్నారు .ఈసంధర్భంగా గుండ్లసాగర్ గ్రామసర్పంచ్ టేగామసర్పంచ్ మానసశివ ను మాట్లాడుతూ నీలం యాదగిరి కి సంబందించిన వేతనం చెక్ కొట్టించడం జరిగిందని అది ఆన్‌లైన్ ప్రాసెస్‌లో ఉందని త్వరలోనే వేతనం యాదగిరి ఎకౌంట్‌లో పడుతుందని తెలిపారు.

## ధన్యం కొనుగోలు ఎప్పుడాని ఎదురు చూస్తున్న రైతన్నలు

**ప్రజాపక్షం / వేలేరు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే సదుద్దేశంతోనే దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంబించగా ఇటీవలే స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి వేలేరు మండలకేంద్రంలో దాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంబించినప్పటికీ నేటికీ దాన్యం కొనుగోలు చేయక పోవడంతో మండలంలోని పలుగ్రామాల రైతన్నల ఎదురు చూపులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బుధవారం వేలేరు మండలంలోని పలు గ్రామాలలో ప్రజాపక్షం విలేకరి జిల్లెల్ల నారాయణ సందర్శించగా ఏఒక్క గ్రామంలో కూడా దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని పలు గ్రామాలలోని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పలుగ్రామాలలో ధాళారులే దాన్యం కొనుగోలు చేస్తూ చేస్తూ వివిద బినామీల పేరుతో కొనుగోలు కేంద్రాల వారితో కుమ్మక్కై ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా అధికారుల స్పందించి దాన్యం కొనుగోలు చేసి ధాళారుల నుండి కాపాడాలని కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించిన మార్కెట్ చైర్ పర్సన్ అండాలు



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని కోలుకొండ గ్రామంలో ఐకేపీ ఆద్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొడకండ్ల మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ నల్ల అండాలు, కోలుకొండ గ్రామ సర్పంచ్ కోతి స్రవంతి ప్రవీణ్ గౌడ్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కొనుగోలు కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలనా్నరు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరక్టర్ సత్యనారాయణ ఉప సర్పంచ్ జయమ్మ, వార్డు సభ్యులు స్వరూప, బీరప్ప, జ్యోతి, నర్సయ్య, శ్రవణ్‌కుమార్, షాబుద్దీన్, ఏపీఎం, పంచాయితి కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, సీసీ సోమనారాయణ, నాయకులు మల్లయ్య, సోమయ్య, ఎల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శి కాంగ్రెస్ నాయకుల

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనుముల నాగరాజు తల్లి లక్ష్మి మృతిచెందగా ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సిరెడ్డి ఆదేశాల మేరకు కొడకండ్ల మార్కెట్ చైర్మన్ నల్ల అండాలు వారి ఇంటికి వెళ్లి భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మార్కెట్ కమిటి డైరక్టర్ సత్యనారాయణ, గ్రామ పార్టీ అద్యక్షుడు, వార్డు మెంబర్ ఆగయ్య, ఐలయ్య, శ్రీనివాస్, రమణాచారి, వెంకటేశ్వర్లు, నాయకులు ధర్మారెడ్డి, గణేష్, వెంకన్న, రమేష్, సత్యనారాయణ, వెంకన్న, రాజేందర్, నరేందర్, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.